క్లుప్తంగా

కాలిబాటలతో తెగుళ్ల నివారణ



వరి పంటలో కాలిబాటలు వేసిన రైతు

జి.సిగడాం: వరి పంటలో కాలిబాటలు వేసుకంటే తెగుళ్లను నివారించవచ్చని ఏఓ శ్రీనివాసరావు తెలిపారు. వరి దుబ్బు ఎదుగుదల బాగుంటుందన్నారు. ఎరువులు, పురుగు మందులు వేసే సమయంలో అనుకూలంగా ఉంటుందన్నారు. వరి పంటకు తెగుళ్లు సోకితే తనకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. వెంటనే పంట పొలాలను పరిశీలించి సూచనలు, సలహాలు అందజేస్తానన్నారు.

వినాయక ఉత్సవాలకు పందిరిరాట



మొండేటివీధిలో పందిరిరాట

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని పలు ఆలయాల వద్ద వినాయక చవితి ఉత్సవాల ప్రారంభ సూచికంగా ఆదివారం పందిరిరాట నిర్వహించారు. మొండేటివీధిలోని లక్ష్మీగణపతి ఆలయం, నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర ఆలయం వద్ద జరిగిన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

'అభినయం' బృందం అదరహో



బహుమతులతో నీరజ బృందం

శ్రీకాకుళం కల్చరల్ : స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఆదివారం విశాఖలోని కళాభారతి ఆడిటోరియంలో జాతీయ స్థాయి సంగీత, నృత్యోత్సవం పోటీలు నిర్వహించారు. ఇందులో పట్టణానికి చెందిన అభినయ నృత్య నికేతన్ నృత్య దర్శకురాలు టి.నీరజా సుబ్రహ్మణ్యం శిష్యులు పలు శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించి ప్రశంసలు పొందారు. వీరికి సినీ తారలు రాగిణి, సుమనశ్రీ, సంస్థ అధ్యక్షులు విజయమాధవి చేతుల మీదుగా ధ్రువపత్రాలు, నీరజకు నటరాజ విగ్రహం అందించి సత్కరించారు.

దోమాంలో లో ఓల్టేజీ సమస్య

ఎచ్చెర్ల క్యాంపస్: దోమాంలో విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో గత కొద్దిరోజులుగా గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. అదనపు ట్రాన్స్‌ఫార్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. విద్యుత్ వినియోగ సామర్థ్యం మేరకు టాన్స్‌ఫార్మర్లు లేకపోవటం వల్ల తరచూ ఫీజులు కొట్టేయటం వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. పలుసార్లు రాత్రులు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భాషా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న స్వామినాయుడు

శ్రీకాకుళం రూరల్: విద్యార్థులు భాషా నైపుణ్యాలను పెంచుకోవడానికి వర్క్‌షాపులు ఉపయోగపడతాయని గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు అన్నారు. మునసబుపేటలోని గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్సు అండ్ మేనేజ్‌మెంట్‌లో ఆదివారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో విభిన్నమైన సాహిత్య అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు, తెలుగు విభాగాధిపతి భమిడిపాటి గౌరీశంకర్, ఐక్యూ సమన్వయకర్త మార్థండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మురపాకలో పారిశుద్ధ్య పనులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని మురపాక గ్రామంలో ఆదివారం పారిశుద్ధ్య పనులను చేపట్టారు. వీధులను శుభ్రం చేశారు. చెత్తాచెదారాలను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్‌యార్డ్‌కు తరలించారు.

లోకనాథం.. ప్రతిభ బహుముఖం



తులసీతీర్థం నాటికలో రామలింగస్వామి

- నాటక, సినీ కళాకారుడిగా, దర్శకుడిగా, రేడియో ఆర్టిస్టుగా రాణిస్తున్న లోకనాథం రామలింగస్వామి
- ఐదు దశాబ్దాలుగా కళామ తల్లి సేవలో..
- యజ్ఞం సినిమాలో నటనకు బంగారు నంది అవార్డు స్వీకరణ

శ్రీకాకుళం కల్చరల్ : జానపద, సాంఘిక నాటకాలలో విలక్షణ పాత్రలు పోషిస్తూ సుమారు ఐదు దశాబ్దాలుగా కళామతల్లి సేవలో తరిస్తున్నారు నగరానికి చెందిన ప్రముఖ కళాకారుడు లోకనాథం రామలింగస్వామి. పాత శ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా సమీపంలో నివాసముంటున్న ఈయన 1968లో స్నేహితులతో కలిసి లలితశ్రీ కళాసమితి అనే సంస్థ ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. 1949లో జన్మించిన ఈయన చిత్రలేఖనోపాధ్యాయుడిగా శ్రీకాకుళం పురపాలక సంఘం ఉన్నత పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. 1997లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. మొదటిగా శ్రీవేంకటేశ్వర నాటక కళాసమితిని 1967లో దివంగత డాక్టర్ ఎల్.సూర్యలింగం వంటి ప్రముఖులతో కలిసి స్థాపించారు. నాటకాలు, సినిమాలలో నటుడిగా రాణించారు. ప్రస్తుతం రంగస్థల కళాకారుల సమాఖ్యలో నిర్వహిస్తున్న నెలవారీ సాంస్కృతిక విభాగంలో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ సేవలను కొనసాగిస్తున్నారు. నటవిశారద బిరుదు అందుకున్నారు.

అద్భుత ప్రదర్శనలు..

1967 నుంచి నాటకాలలో నటిస్తూ పేరు తెచ్చుకున్నారు. 'కొత్త కాపురం', 'ఆడది', 'నీలి నీడలు', 'నిజం కాటేసింది', 'దొంగలొస్తున్నారు స్వాగతం చెప్పండి', 'తులసి తీర్థం', 'రఘుపతి రాఘవ రాజారాం', 'కనువిప్పు', 'పులివేట'వంటి పలు సందేశాత్మక సాంఘిక నాటకాలలో వివిధ పాత్రలు పోషించి ప్రేక్షక హృదయాలను దోచుకున్నారు. 'బాలనాగమ్మ' జానపద నాటకంలో కార్యవర్ధి రాజు పాత్ర ద్వారా ఎంతో గుర్తింపు పొందారు. నటుడిగానే కాక మేకప్‌మేన్‌గా కూడా గుర్తింపు పొందారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పలు సాంస్కృతిక పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.



అమ్మమీదొట్టు సినిమాలో లాయరుగా రామలింగస్వామి

హైదరాబాద్‌లోని ఆంధ్రప్రదేశ్ ప్రిపరేటరీ కమిటీ(క్యూబా) వారు నిర్వహించిన 11వ ప్రపంచ యువత, విద్యార్థుల ఉత్సవంలో 'తులసి తీర్థం' నాటిక ప్రదర్శించారు. ఇందులో 'రంగాచార్యులు' పాత్రకు ఉత్తమ ద్వితీయ నటుడిగా రజత పతకం అందుకున్నారు. శ్రీకాకుళం ఘంటసాల స్మృత్యంజలి వారు తిమ్మరాజు శివరావు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. బెంగళూరుకు చెందిన సాంగ్ అండ్ డ్రామా ఆధ్వర్యంలో కోడిరామ్మూర్తి స్టేడియంలో వినూత్న ప్రదర్శగా ఒకేసారి 16వేదికలపై వారంరోజుల పాటు ప్రదర్శించిన 'జాతికి ఊపిరి స్వాతంత్ర్యం' సాంఘిక నాటకంలో 'నెహ్రూ', 'రూథర్‌ఫర్డ్'గా నటించారు. నీలినీడలు, నిజంకాటేసింది, చరిత్ర, చీకటి, స్త్రీ నాటకాలకు దర్శకత్వం వహించారు.

'యజ్ఞం' సినిమాకు బంగారు నంది..

సాహితీ చిత్ర బేనర్‌పై కాళీపట్నం రామారావు కథ ఆధారంగా గుత్తారామినీడు దర్శత్వంలో నిర్మించి 'యజ్ఞం' చలనచిత్రంలో రామలింగస్వామి పంచాయతీ ఆఫీసరు పాత్ర పోషించారు. ఇందులో పాత్రకు 1991 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం బంగారు నంది అవార్డు అందుకున్నారు. రామలింగస్వామి టెలీఫిల్మ్‌లో నటించడంతో పాటు నిర్మాణం కూడా చేశారు. ప్రభుత్వం రికార్డు ఆఫ్ రైట్స్ పథకం కింద నిర్మించిన 'పేచీ' టెలీఫిల్మ్‌లో కూడా నటించారు. వి.ఎస్.ఆదిత్య దర్శకత్వంలో నిర్మించిన 'శ్రీరామ్', కె.మంజులానాయడు నిర్మించిన 'కనులు మూసినా నీవాయే', ఆర్.నారాయణమూర్తి నిర్మించిన 'అమ్మమీద ఒట్టు' సినిమాలలో నటించారు. టెలీఫిల్మ్ నిర్మాణ రంగంలో ప్రగతికి పంచసూత్రాలు, ష్..నవ్వకండి, మట్టిలో మాణిక్యం, అల్లుడు ఫ్రం అమెరికా, ఓ నాన్న నీ మనసు వెన్న, యజ్ఞోపవీతం, ఉమ్మడి కుటుంబం ఈయనే నిర్మించారు.



యజ్ఞం సినిమా దర్శకుడు రామినీడుతో బంగారు నందితో రామలింగస్వామి

ఆకాశవాణిలో..

నటుడు, రూపశిల్పి అయిన రామలింగస్వామి ఆకాశవాణి(విశాఖపట్నం కేంద్రం)లో డ్రామా విభాగంలో గుర్తింపు పొందిన కళాకారుడు కావడం విశేషం. అనేక రేడియో నాటకాల్లో పలు పాత్రలు ధరించి ప్రశంసలు పొందారు.

బిరుదులు..సత్కారాలు

రామలింగస్వామికి కాకినాడకు చెందిన కళాజాగృతి సంస్థ 2011లో 'నటవిశారద' బిరుదుతో సత్కరించింది. విశాఖ కె.వి.మెమోరియల్ ఆర్ట్స్, పిళ్లై ప్రవాసాంధ్ర నాటక కళాపరిషత్తు తదితరులు కళారంగానికి ఈయన చేసిన సేవలకు సన్మానం చేశారు. ఇటీవల బిలాయ్‌లో జరిగిన అంతర్జాతీయ నాటిక పోటీలలో లలితశ్రీ కళాసమితి సంస్థ ద్వారా స్వీయ దర్శకత్వంలోప్రదర్శించిన 'కర్మ' నాటికకు ఉత్తమ ద్వితీయ ప్రదర్శన, ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకత్వం అవార్డులు వరించాయి.



అవార్డులతో రామలింగస్వామి

జీవితాన్ని ఆనందంగా గడపాలి



కోర్సు సర్టిఫికెట్లతో సాధకులు, టీచర్లు

శ్రీకాకుళం కల్చరల్ : జీవితాన్ని ఆనందంగా గడపాలని, కొందరు మాత్రం అహంతో సంతోషం దూరం చేసుకుంటున్నారని ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా ప్రతినిధి కింజరాపు అమ్మన్నాయుడు అన్నారు. పాన్ ఆఫ్ ఇండియాలో భాగంగా ఆరు రోజులుగా శ్రీకాకుళం పెద్దపాడు రోడ్డులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సెంటర్‌లో ఆనందోత్సవం హ్యాపీనెస్ కోర్సు ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. సంస్థ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా సాధకులతో ప్రసంగించారు. టీచర్ దేసూళ సురేంద్ర ఆధ్వర్యంలో ప్రాణాయామం, యోగాసనాలు, సూర్యనమస్కారాలు, సుదర్శన క్రియ చేయించారు. అనంతరం టీచర్లు సురేంద్ర, కాత్యాయనీ, వారణాసి సందీప్‌లను సత్కరించారు. సింహాద్రి శ్రీనివాస్, ఠాకూర్‌దాస్, జి.సురేష్ బృందం భజన గీతాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో టీచర్లు కింతలి గోవింద్, శశి భూషణరావు, టి.అప్పారావు, వెంకటప్పారావు, సిమ్మ ఠాకూర్‌దాస్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోటీలు



చిన్నారులకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని ధర్మశాస్తా ఆలయ ఆవరణలో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు డ్రాయింగ్, దేశనాయకుల వేషధారణ పోటీలు ఆదివారం నిర్వహించారు. వేషధారణ పోటీల్లో ఐ.సాత్విక (ఝాన్సీ లక్ష్మీబాయి), ఎల్.మేఘన(రాణి రుద్రమదేవి), బి.రోషిణి (సరోజినీ నాయుడు), బి.భవ్య(భగత్‌సింగ్)లు విజేతలు నిలిచి బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు బీఎంఎస్ పట్నాయక్, నిక్కు హరిసత్యనారాయణ, ప్రసాద్, ఎల్.దీప్తి తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండండి

- చంద్రయ్యపేట చేపల చెరువులో విష ప్రయోగంపై దర్యాప్తు చేపట్టాలి
- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



రణస్థలం: అనంద్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్, నాయకులు



జి.సిగడాం: చంద్రయ్యపేటలో వాణిశ్రీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని, అందరూ ధైర్యంగా ఉండాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చంద్రయ్యపేటలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు కోరాడ వాణిశ్రీ కుమారుడు వెంకటేష్ చేపల చెరువులో ఈ నెల 9న విషప్రయోగం చేయడంతో చేపలన్నీ మృత్యువాతపడ్డాయి. సుమారు రూ.3 లక్షలు నష్టం వాటిల్లింది. ఈ విషయం తెలుసుకున్న కిరణ్‌కుమార్ ఆ కుటుంబాన్ని ఆదివారం పరామర్శంచారు. చేపల చెరువులో విష ప్రయోగం చేసిన వారిపై ప్రత్యేక దర్యాప్తు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. పార్టీ కార్యకర్తలపై ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుమన్నారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, రణస్థలం వైస్ ఎంపీపీ రాయపురెడ్డి బుజ్జి, మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం, సర్పంచ్ బొల్లా జనార్దనరావు, నాయకులు పెద్ది రమణ, పిట్టా భాస్కరరావు, కోమ్ము గణపతి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రణస్థలం: మండలంలోని సంచాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డి ఆనంద్ కుమారుడు అనారోగ్యంతో బాధపడుతన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆదివారం పరామర్శించి త్వరగా కోలుకోవాలని అకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు రెడ్డి రాము, మీసాల దాలినాయుడు తదితరులు ఉన్నారు.

అస్తవ్యస్తంగా కాలువ పలకలు

శ్రీకాకుళం (పీఎస్ కాలనీ): ప్రతి రోజు వేలాది మంది రాకపోకలు సాగించే రిమ్స్ హాస్పిటల్ రోడ్డు మధ్య కాలువపై పలకలు సరిగ్గా వేయకపోవడంతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. రిమ్స్ హాస్పిటల్‌కి అత్యవసరంగా వచ్చే అంబులెన్స్ డ్రైవర్లు సైతం రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పలకలు సరిచేయాలని కోరుతున్నారు.



రిమ్స్‌రోడ్డులో అస్తవ్యస్తంగా ఉన్న పలకలు

అపూర్వ సమ్మేళనం..



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు, ఆనాటి ఉపాధ్యాయులు

జి.సిగడాం: మండలంలోని డీఆర్‌వలస (దాలెమ రాజువలస) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004 నుంచి 2024 వరకు 10వ తరగతి చదువుకున్న విద్యార్థులందరూ ఆదివారం ఒకచోట కలిసి ఆనందంగా గడిపారు. ఒకరి కష్టసుఖాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులు కాయల రమణ (ప్రస్తుతం జెడ్పీటీసీ సభ్యుడు), పిల్లల రామకృష్ణ, రామారావు, ప్రకాశరావు, శోభాదేవి, రమణమ్మ, కృష్ణంనాయుడు, నర్సింహులు, గోవింద్ తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాలి సూర్యనారాయణ, శిరుగుడు రామారావు అరటికట్ల సురేష్, పిసిని సంతోష్ కుమార్, రాళ్లపూడి ధనుంజయరావు, నక్క రామరావు, పైడినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో గి'రాఖీ'



మార్కెట్లో రాఖీలు

శ్రీకాకుళం కల్చరల్ : శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాఖీల అమ్మకాలు జోరుగా సాగాయి. రూ.10 నుంచి రూ.1000 వరకు విభిన్న రూపాల్లో రాఖీలను కొనుగోలు చేశారు. మిక్కీమౌస్‌లు, దేవుడి బొమ్మలు, లవ్‌గుర్తులు, విభిన్న డిజైన్లతో ఉన్న రాఖీల కొనుగోలుకు బాలబాలికలు, మహిళలు పోటీపడ్డారు. కొందరు వెండి రాఖీలు సైతం కొనుగోలు చేశారు.

నిర్లక్ష్యపు నీడలో ట్రాన్స్‌ఫార్మర్



శ్రీకాకుళం రూరల్: రాగోలు (వాకలవలస) జగనన్న కాలనీలో రెండోలైన్‌లోని ట్రాన్స్‌ఫర్ నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతోంది. ముళ్ల కంచె అల్లుకోవడంతో తరచూ శబ్దాలు వినిపిస్తున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. దీనికి కూతవేటు దూరంలోనే సబ్‌స్టేషన్ ఉంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రక్తదానానికి విశేష స్పందన



రక్తదాతలతో నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని నేత్ర వైద్యుడు పీఎల్ఎన్ రాజు ఆధ్వర్యంలో కంటి ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం బాసటగా నిలిచింది. జిల్లా యోగ మహిళా అధ్యక్షురాలు తంగి స్వాతితోపాటు జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షులు తంగి మురళీమోహన్ రావు పిలుపు మేరకు సుమారు వంద మంది యువత, ఉపాధ్యాయులు, యోగా విద్యార్థులు రక్తదానం చేసేందుకు ముందుకొచ్చారు. వీరిని డాక్టర్ పీఎల్ఎన్ రాజు, కుటుంబ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో డెంటిస్ట్ కృష్ణంరాజు, పీఎల్ఎన్ ఆకాష్, భవానీ, శ్రీను, తంగి సురేష్, పట్టణ రాజశేఖర్, బట్న కామేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గీతా సారమే శ్రీకృష్ణతత్వం

శ్రీకాకుళం కల్చరల్:

భగవద్గీతా సారమే శ్రీకృష్ణతత్వమని తెలుగు అధ్యాపకుడు భమిడిపాటి గౌరీశంకర్ అన్నారు. ఆదివారం నగరంలోని ఉపనిషన్మందిరంలో శ్రీకృష్ణ తత్వంపై ఉపన్యసించారు. భారతం జరిగి వేల సంవత్సరాలు గడిచినా నేటికీ శ్రీకృష్ణుడి గురించి చెప్పుకోవడమంటే సామాజికంగా కృష్ణతత్వం జీవించి ఉన్నట్లేనన్నారు. అనంతరం వక్తను సత్కరించారు. కార్యక్రమంలో పి.పతంజలి శాస్త్రి, శ్రీనివాసరావు, కోమలరావు, ఎన్ఎస్ఎన్ స్వామి, ఎన్.నరసింహమూర్తి, ఈశ్వరరావు, దుర్గారావు, ప్యాట్రిక్, సంగమేశ్వరరావు, కె.శారద, సరస్వతి, జోగారావు తదితరులు పాల్గొన్నారు.



వక్తను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

విద్యార్థులకు శ్లోకపఠన పోటీలు

శ్రీకాకుళం కల్చరల్:

విద్యార్థులు భగవద్గీత చదివితే వ్యక్తిత్వ వికాసాలు తెలుస్తాయని నారాయణ తిరుమల దేవాలయ ప్రధాన అర్చకుడు గురుగుబెల్లి శ్రీనివాసులు అన్నారు. స్థానిక నారాయణ తిరుమల ఆలయంలో కృష్ణాష్టమి పురస్కరించుకుని గీతలోని 12వ అధ్యాయంపై విద్యార్థులకు శ్లోక కంఠస్థ పోటీలు ఆదివారం నిర్వహించారు. సీనియర్ విభాగంలో ఎం.రుషి వర్మ (ప్రథమ), వై.హాసిని (ద్వితీయ), ఎ.సాయి (తృతీయ) బహుమతులు పొందగా, జి.శ్రీలేఖ, జి.దీక్షిత, వి.జోత్స్నలు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. జూనియర్స్ విభాగంలో కె.వెంకటశైలజ (ప్రథమ), ఎస్.కార్తీక్‌రెడ్డి (ద్వితీయ), ఎం.శశాంక్ వర్మ (తృతీయ) బహుమతులు పొందగా ఎస్.గౌతమికి ప్రోత్సాహక బహుమతి లభించింది. కార్యక్రమంలో మహంతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధాన అర్చకుడు శ్రీనివాస్

నగరంలో శాంతి ర్యాలీ

శ్రీకాకుళం అర్బన్ : ప్రపంచమంతా శాంతియుతంగా మెలగాలని మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ అన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం ఘటనను నిరసిస్తూ జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న విశ్రాంత ఉపాధ్యాయుల ఉద్యోగ భవనం నుంచి విశ్రాంత ఉద్యోగులు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, జిల్లా ప్రముఖులు కలిసి శాంతి నిర్వహించారు. కార్యక్రమంలో విజయనగరం, శ్రీకాకుళం మానవత అభివృద్ధి కమిటీ చైర్మన్ జానకిరామరాజు, జిల్లా చైర్మన్ డి.విష్ణుమూర్తి, వైస్ చైర్మన్ నటుకుల మోహన్, కన్వీనర్ పార్వతీశం, విశ్రాంత ఉపాధ్యాయులు, ఆడపిల్ల ఫౌండేషన్ అధ్యక్షులు లావణ్య, సభ్యులు ఉర్లం శివతేజ, టి.అప్పలనాయుడు, టెక్కం రాంగోపాల్, జోగి రాజు, జోగి భారతి, మాదవి, పొడుగు చరణ్, సుప్రజ ఫౌండేషన్ అధ్యక్షులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు